# దేవుడెలా ఉంటాడు?

రాత్రి మూడుగంటలవేళ వీధి చీకటి చీకటిగా ఉంది. ఆ క్రిందటిరోజే విద్యార్థులు ట్యూబ్ లైట్లన్నీ పగలగొట్టారు. ఆకాశమంతా కారుమబ్బులు కమ్ముతున్నాయి. సన్నటి తుప్పర పడుతున్నది.

ర్రయిమంటూ ఒక కారువచ్చి 'హిమబిందు' ముందర ఆగింది. డ్రైవరు హారన్ మోగించాడు.

"ఇంత రాత్రివేళ-ఈ వానజల్లులో హారన్ వినబడదు గాని-దిగి గేటుతెరచి తలుపు కొట్టరా ప్రకాశం" అన్నాడు సత్యనారాయణ.

తలుపు దగ్గరగా ఉన్న బజర్ ఆగకుండా మోగుతుంటే-"అబ్బబ్బ! రాత్రంతా పాప జ్వరంతో ఏడ్చిఏడ్చి ఇప్పుడే పడుకుంది. బజర్ గట్టిగా నొక్కకండి తలుపు తీస్తాను" అంటూ లలిత లైటువెలిగించి తలుపు తీసింది.

"అమ్మా, అయ్యగారు నాలుగురోజులనుంచీ రాత్రి పగలూ అనకుండా పని చేశారు. తిరుగు ప్రయాణంలో కారు కుదుపుకు నిద్రపట్టింది. అయ్యగారిని లేపకుండా మెల్లగాతీసుకెళ్ళి మంచంమీద పడుకోబెట్టమని కాంట్రాక్టరుగారు చెప్పారు. తీసురమ్మంటారా?" అడిగాడు ప్రకాశం.

"తీసుకురా ఇంతలో పక్కదులుపుతాను. వారంరోజులనాడు వెళ్ళిన ఆయన రాత్రీపగలూ పని చేసిచేసి ఈ వానజల్లులోనా ఇంటికిరావడం? బాబు పుట్టినరోజుకు ఇంటికిరమ్మని అంతగాచెప్పాను. ఎప్పుడూ ఆఫీసూ పనులూఅంటూ తిరుగుతారు." సణుగుతూ పక్కదులిపి దుప్పటి సరిచేసింది లలిత.

డ్రైవరూ, ప్రకాశంకలిసి కృష్ణమోహన్ను తీసుకువచ్చి మంచమ్మీద పడుకోబెట్టారు. లలిత బూట్లువిప్పి రగ్గుకప్పింది.

ఆమెకు రెండురోజులనుంచీ నిద్రలేదు. పాప చెయ్యిదిగటంలేదు భుజమ్మీద

పడుకోబెట్టుకునే భోజనంచేస్తున్నది. పాపపడుకున్నప్పుడే తానొకకునుకుతియ్యాలి. పక్క మీదికి ఒరిగి, కృష్ణమోహన్‌మీద ఒక చెయ్యి వేసుకుని పడుకుంది. కాని, కళ్ళు అప్పుడప్పుడు మూతపడినా నిద్రమాత్రంరాలేదు. ఏదో మత్తుగాఉన్నట్టుంది. ఆ స్థితిలోకూడా అతను తిరిగివచ్చాడన్న సంతృప్తికలిగింది. తను చెప్పినరోజుకు రాలేదన్న కినుకాఉంది మనసులో.

"మీతో చెప్పానుకదండీ పాప పుట్టినరోజుకు తప్పకుండా రావాలని? పార్టీ గ్రాండుగా చెయ్యాలని మీరేగాఅన్నది? కిందటి సంవత్సరం అన్నిఏర్పాట్లుచేస్తే తీరా సమయానికి కుంభవర్షంకురిసి, షామియానా అంతాతడిసి. కుర్చీలు నీళ్ళలో మునిగాయి. ఈ సారైనా బాగా చేద్దామని, మీరు మరిచిపోకుండా చీటీరాసి జేబులో పెట్టాను. అదీ చూసుకోటానికి టైములేదుకాబోలు"

లలిత కృష్ణమోహన్ మెడదగ్గరినుంచి బుజమువరకూ తడిమి "ఏమిటో అశ్రద్ధ ఈ మనిషికి" అనుకుంటూ ఒక కునుకు తీసింది, ఇంతలో పాపలేచింది. "పడుకోవేతల్లీ! నాన్న మంచి నిద్రలోఉన్నారు. పనీపనీ అంటూ ఏనాడైనా విశ్రాంతిగా ఇంట్లోఉండి పెళ్ళాం పిల్లలతో గడపరు. ఎప్పుడూ టూర్ ప్రోగ్రాములూ, లేకపోతే ఆఫీసు. నాన్నను పడుకోనీయమ్మా పాపం ఎన్నాళ్ళయిందో కంటినిండా నిద్రపోయి" పాపను జోకొట్టి మళ్ళీ మగత నిద్రలోకి జారుకుంది.

అతను ఇంటికివచ్చాడన్న సంతోషం ఆమెకు కళ్ళు మూతలుపడుతున్నా ఏదో మాట్లాడేటట్టు చేస్తోంది.

"కొత్త సినిమా వచ్చిందని సెక్రటరీగారి భార్య ఫోనుచేసింది - 'చాలా బాగుందని అందరూ అంటున్నారు. పోదాంరండి' అంటూ నేను రాలేనన్నాను. ఎందుకోతెలుసా? మనిద్దరం సినిమాకువెళ్ళి ఎన్నాళ్ళయింది? మీకు కాస్త తీరిక దొరికితే స్నేహితులూ, లయన్సుక్లబ్బూ అంటూ కలవరిస్తారు. నెలకొక్కసారైనా మీతో సినిమాకు వెళ్ళాలని నాకు ఉండదా చెప్పండి? ఆవిడతోవెళితే మీతో వెళ్ళినట్టుగా ఉంటుందా? అందులో ఆవిడ వాగుడుకాయ. ఎదుటివాళ్ళు వింటున్నారా, లేదా అని చూడదు. ఒకటే సోది. ఇక సినిమా ఏంచూస్తాం? అందుకే రానన్నాను. మీరొచ్చారుగా. రేపు మనం వెళ్ళొచ్చు. రేపయినా మీకు వీలవుతుందా? పాపకు జ్వరం తగ్గిందిగాని బలహీనంవల్ల ఒకటే ఏడుపు. రేపు పనిమనిషిని ఉంచుతాను పాపదగ్గర"

పాప కదలకుండా పడుకుంది. లలితకూ నిద్రపట్టింది.

ఐదుగంటలకు పక్కఇంట్లో అలారంమోగింది. పరీక్షలకు చదువుకోవాలని అలారం పెట్టుకుంటాడుగాని లేవడు వాళ్ళబ్బాయి. అలారం మోగినప్పుడల్లా గొంతు నొక్కుతూ ఉంటాడు.

సాధారణంగా లలిత ఆ అలారంమోతకే లేస్తుంది. ఇవాళ అతనుమోగటం విని వెంటనే ఆపేశాడు. లలితకప్పుడే బాగా నిద్రపట్టినట్టుంది.

ఆరుగంటలకు పనిమనిషి వచ్చింది. పెరటిగది తలుపుతాళం దానిదగ్గరే ఉంటుంది. తలుపు తెరుచుకుని పనిచేస్తున్నది.

వంటమనిషి ఎందుకో రావటంలేదు పనిమనిషే కాఫీ చేస్తున్నది.

"అమ్మగారూ!" పిలిచింది.

లలిత కళ్ళు నలుముకుంటూ లేచి గది బయటికివచ్చి "గట్టిగా అరవకు. రాత్రి అయ్యగారువచ్చారు. మంచినిద్రలోఉన్నారు. ఎనిమిదిగంటలకైనా లేస్తారు. చపాతీచేసి కూరచెయ్యి. కాఫీ స్ట్రాంగుగాఉండాలి. ఇవాళ వంటకూడా స్పెషల్‌గా ఉండాలి. రుచిగాచెయ్యి. అదేమిటో, డ్రైవరూ కనబడటంలేదు. బాగుచేయటానికిచ్చిన కారూ అంతులేదు. నేను కొంచంసేపు పడుకునిలేస్తాను. నీవు పనిచూసుకో" అటూ వంటింటి తాళాలిచ్చి మళ్ళీ పడుకుంది. ఆమె చెయ్యి అతని కాపు సవరిస్తూనే ఉంది.

"అబ్బా ఇంకా మెలుకువరానేలేదా? అవునుగాని-మీరు వెళ్ళేప్పుడు నాతో ఏం చెప్పారు? మరిచిపోయారా? నా సంగతి ఎప్పుడూ మరిచిపోతూనేఉంటారు. సరే! మీకు మామూలేగా? నేను జ్ఞాపకం చేస్తాలెండి. 'రాగానే నా జేబు చూసుకో లోపలిజేబులో రవ్వల కమ్మలుంటాయి తీసుకోమన్నారు నిద్రపోతూనేఉన్నారు. మాట్లాడించినా మాట్లాడటంలేదు మీరు ఎక్కడలేస్తారో అని నేను జేబుచూడలేదు. పోనిలెండి. నిద్రలేచాక మీరే మీచేత్తో ఇద్దురుగాని. ఇవాళ కాఫీ, టిఫిన్ అయిన తరువాత మహేంద్రగిరి మీద కడుతున్న మనిల్లు నాకు చూపించాలి. ఎప్పుడడిగినా రాళ్లూ, సిమెంటూ ఏంచూస్తావు? ఇల్లు తయారైన తరువాత చూడచ్చులే' అంటూ ఇన్నిరోజులూ జరిపారు. ఇవాళ-ఏది ఏమైనాగాని ఆ ఇల్లు చూడాల్సిందే. నేను

చెప్పినట్టుగా అన్ని వసతులూ ఉన్నాయో, లేదో నా కళ్ళతో నేను చూడాలి. మీ సంగతి సరేసరి.

ముందుచెబితే "ఇప్పుడే చెప్పకు నేనే మరిచిపోతాను అంటారు తరువాత చెబితే 'అంతా అయ్యాక చెబుతావు. ఇప్పుడు మళ్ళీ అంతా పడగొట్టాలి' అంటారు అబ్బ మీతో ఎలా వేగటం?"

ఎనిమిది గంటలకు కళ్ళు నలుపుకుంటూ లేచింది లలిత. కృష్ణమోహన్ అప్పటికీ లేవలేదు.

లలిత ఇక ఆగలేకపోయింది "కావాలంటే కాఫీ తాగి మళ్ళీ పడుకోండి" అంటూ తట్టి లేపింది. చేత్తో కుదిపింది- చెవిలో నీళ్ళుపోసి "ఇప్పుడైనా లేవరా?" అంటూ.

అతను కదలలేదు.

గబగబా గదిలోనుంచి బయటికివచ్చి ఫ్యామిలీ డాక్టరుకు ఫోను చేసింది వెంటనేరమ్మని. ఆమె భయంతో వణికిపోతూంది.

ఏమిటి సంగతి? పాపకు జ్వరం తగ్గిందన్నారు?"

"రాత్రి మూడుగంటలకు కృష్ణ టూరునుంచివచ్చారు. అప్పటినుంచీ ఒకటే నిద్ర ఎనిమిది గంటలైనా లేవలేదు. ఎంత కదిపినా కదలటంలేదు ఎంతపిలిచినా పలకటంలేదు. మీరు వెంటనే బయలుదేరిరండి. నాకు భయంగాఉంది" ఫోను పెట్టేసింది లలిత.

ఆమెకు ఒంటినిండా చెమటపోస్తూంది. గుండె గబగబా కొట్టుకుంటోంది.

గేటులోకి కారువచ్చిన చప్పుడు కాగానే లేచి ఎదురుగావెళ్ళి "రండి డాక్టరు గారూ" అంటూ ఆయనను గదిలోకి తీసుకువెళ్ళింది.

కప్పిన రగ్గు తొలగించి చెయ్యిపట్టుకుని నాడిచూశాడు. స్టెత్‌తో గుండె చూశాడు. కనురెప్పలు తెరిచిచూశాడు.

లలిత ఆందోళనతో పక్కగా నిలబడి చూస్తున్నది.

కృష్ణమోహన్ దేహానికి రగ్గు కప్పి, డాక్టరు స్టెత్‌మడిచి జేబులో పెట్టుకున్నాడు. కొద్ది సేపటికి వెనక్కు తిరిగాడు.

"డాక్టరుగారూ ఏమైంది ?" ఎండిపోయిన పెదవులతో-తడబడుతూ అడిగింది.

"విక్టోరియా హాస్పిటల్లో ఒక పెద్దడాక్టరు ఉన్నాడు. ఆయనను రమ్మనమని ఫోనుచేస్తాను. ఆయన విదేశాలకు వెళ్ళి చదువుకునివచ్చాడు-మంచి అనుభవం కలవాడు. నేను కొన్ని కేసుల్లో అయన సలహాలు అడుగుతుంటాను" అంటూ అయనకు ఫోనుచేసి, "మీరు భయపడకండి లలితగారూ. పెద్ద డాక్టరుగారు వస్తున్నారు. మీరిలా వచ్చి కుర్చీలోకూర్చోండి" ఆమెను హాల్లోకి తీసుకువెళ్లాడు. ఆమెను ఒక కుర్చీలో కూర్చోమని పనిమనిషిని పిలిచాడు.

"అమ్మగారికి వేడివేడి కాఫీ తీసుకువచ్చి తాగించు".

"మనమందరం కలిసి కాఫీ, టిఫిన్ తీసుకుందాము. తొందరేమిటి డాక్టరుగారూ ?" వణుకుతున్న పెదవులతో అంది లలిత గొంతు సవరించుకుని.

"అలా కాదు. పెద్దడాక్టరుగారు వచ్చేటప్పటికి మీరు కాఫీ తాగి ఉండాలి. ఆయన అడిగే ప్రశ్నలకు మీరు జవాబుచెప్పాలికదా ? ముందు తీసుకోండి. ఆయన వచ్చినతరువాత చురుగ్గా ఉండాలిగాని, ఇలా నీరసంగా ఉంటేఎలా ?" బలవంతం చేసి ఆమె పక్కకుర్చీలో కూర్చుని తాగేటట్లు చేశాడు.

ఆమె అయన బలవంతంమీద సగంకప్పే తాగగలిగింది. పెద్ద డాక్టరు వచ్చి ఏంచెబుతాడోనన్న ఆందోళనతో కళ్ళుమూసుకుంది.

డాక్టరు ఇటూ, అటూ అడుగులు వేస్తున్నాడు గేటు లోపలికి పెద్ద డాక్టరు వచ్చేవరకూ దిక్కుతోచక ఆలోచిస్తూనే ఉన్నాడు. ఆయన కారు ఆగగానే వెంటనే ఎదురువెళ్ళి అక్కడే ఆయనతో మాట్లాడి లోపలికి తీసుకువచ్చాడు.

డాక్టర్లిద్దరూ లోపలికి వెళ్ళుతుండగా సందేహిస్తూ వాళ్ళ వెనక జీవంలేని మనిషిలా వెళ్ళింది లలిత. అప్పటికి వాళ్ళు గదిలోనుంచి వస్తూ ఆమెకు ఎదురుపడ్డారు.

''ఇక్కడ కూర్చుందాము రండమ్మా !" ఆ గది బయటికివచ్చి కుర్చీలో కూర్చున్నాడు డాక్టరు.

"చూడండమ్మా, ఇంజనీర్‌గారి పరిస్థితి తెలియటంలేదు. పరిశీలనలో పెట్టి

చూడాలి. మేము మధ్యాహ్నానికి మళ్ళీవస్తాము. మీవాళ్లెవరైనా ఉన్నారా? మీరు ఒంటరిగా భయపడకుండా దగ్గర ఉండటానికి?''

"ఇక్కడ ఆయన చెల్లెలి భర్త ఉన్నాడు. ఆయన మునిసిపల్ కమిషనర్. టెలిఫోన్ చేస్తేవస్తాడు. పేరు అనంతం. మా నాన్నా చాలాదూరాన ఉన్నారు. ఫోనోగ్రామ్ ఇవ్వాలి" బిక్కముఖం వేసుకుని చెప్పింది.

ఫామిలీ డాక్టరు డైరెక్టరీలో నెంబరుచూసి అనంతానికి ఫోనుచేశాడు.

ఆదుర్దాతో కారు నడుపుకుంటూవచ్చాడు అనంతం. ఇద్దరు డాక్టర్లను చూసి కీడు శంకించి లోపలికి అడుగుపెట్టాడు.

పెద్ద డాక్టరు అనంతాన్ని గదిలోకి తీసుకెళ్ళి సంగతి వివరించిచెప్పాడు.

"నేను ఇట్లా జరుగుతుందని ఎప్పుడో ఊరికేమందలించి చెడ్డవాడినయ్యాను. నుదురు రుద్దుకున్నాడు అనంతం.

నిశ్శబ్దం ఇల్లంతా ఆవరించుకుంది.

"మీరు ఆమెకు ఈ సంగతి మెల్లగా చెప్పండి. అంటూ లలితను ధైర్యంగా ఉండమని డాక్టర్లిద్దరూ వెళ్ళారు.

అంతలో ఒక వ్యక్తి ఆయాసపడుతూ డాక్టర్లతో మాట్లాడి లోపలికివచ్చి గుమ్మం ముందర నిలబడ్డాడు.

"ఏం కావాలి?" అడిగాడు అనంతం.

"నా పేరు నాగేశం. కృష్ణమోహన్‌గారి చేతికింద పనిచేశాను. కాంట్రాక్టరు సత్యనారాయణగారు బజారులో కృష్ణమోహన్‌గారిని గురించి మాట్లాడుతున్నాడు ఆ మాటలువిని అయ్యగారిని చూడాలని ఒక్కపరుగున వచ్చాను అక్కడే నిలబడ్డాడు.

''లోపలికిపోయి చూడు." చేత్తో చూపించాడు.

నాగేశం ఒక్కసారి కృష్ణమోహన్‌ను చూశాడు. దుఃఖం పొంగుకుంటూ వచ్చింది. అక్కడే కుర్చీలో కూర్చున్న లలితను చూస్తే విచారంతో మనసు నీరయింది కళ్ళుతుడుచుకుంటూ బయటికి వచ్చాడు.

పనిమనిషి ద్వారా విని ఇరుగుపొరుగు పోగయ్యారు.

అనంతం, నాగేశం, వరండాలోకి వెళ్ళారు.

"నీవింకా కృష్ణమోహన్ దగ్గర పనిచేస్తున్నావా ?" అడిగాడు అనంతం.

"లేదండి. నన్ను అయ్యగారు డిస్మిస్‌చేశారు. రెండేళ్ళక్రిందట. నన్ను చూస్తే అసహ్యమే కాదు, ఆగ్రహం కూడా, వారిపట్ల నాకుగల విశ్వాసమూ, గౌరవమూ అక్కడికి లాక్కొచ్చాయి" కళ్లు తుడుచుకున్నాడు.

"ఏమన్నా తప్పుచేశావా ?''

"నేనుచేసింది ఒకటే తప్పు. అయ్యగారికి సలహాలిస్తూ పెడదారిన నడిపించే వారంటే నాకు గిట్టలేదండి. అయ్యగారిని దగా చేయాలని చూసేవారంటేనూ అయ్యగారికి ద్రోహం తలపెట్టేవారంటేనూ కడుపులో మంట మండుతుందండి. వాళ్ళు అయ్యగారిచుట్టూ చేరి, నేనక్కడుంటే వాళ్ళకు ప్రమాదమని అయ్యగారి మనసు విరిచేశారు. అందుకే అయ్యగారు నన్ను డిస్‌మిస్ చేశారు. నేను నీడలా అయ్యగారికి తెలియకుండా వెంటే ఉంటున్నాను. కాని అప్పటికే సమయం మించి పోయిందండి. అయ్యగారు సస్పెండవటానికి ఆ కాంట్రాక్టరే కారణమండి" బాధతో నిలబడిపోయాడు నాగేశం.

"ఎప్పటి మాటయ్యా ఇది ?" ఆవేదనతో అడిగాడు అనంతం.

"ఆ కాంట్రాక్టరు అయ్యగారికి లంచాలు ఇప్పించేవాడు. వారి పేరుమీద తనుకూడా తీసుకునేవాడు అతను అయ్యగారిని కారులో ఎక్కించుకుని ఊరి బయట బంగ్లాకు తీసుకువెళ్ళి బాగా తాగించేవాడు. ఆడవాళ్ళను తీసుకువచ్చేవాడు. అయ్యగారికి అడిగినప్పుడల్లా డబ్బు ఇచ్చినట్టే ఇచ్చి వారి ఆస్తిఅంతా అప్పు కింద రాయించుకున్నాడు. అయ్యగారి ఇల్లూ, ఇళ్ళ స్థలాలూ అన్నీ అతనివై పోయాయి. ఒకసారి పెద్దమొత్తం తీసుకుని అయ్యగారిమీదకి నెట్టాడు నేరాన్ని. ఆ నేరం రుజువుచేసి ఇంతవరకూ తీసుకువచ్చాడు"

"నిజంగా ?"

''ఏడాదయింది. అప్పటినుంచీ అయ్యగారికి నెలనెలా జీతం రావటం లేదండి. వంటవాడూ, డ్రైవరూ గవర్నమెంటు బంట్రోతులండి. అయ్యగారు

సర్వీసులో లేరు కనుక వాళ్ళకు వేరే డ్యూటీపడ్డది. మొన్నటితో ఊరవతల ఉన్న ఇల్లు కూడా అయిపోయిందండి ?''

"అమ్మగారికీ సంగతి తెలుసా ?"

''ఆ యమ్మకు తెలియనివ్వలేదు. ఇంకా అయ్యగారు ఇంజనీరనీ, బాగా డబ్బు సంపాదిస్తున్నారనీ అనుకుంటున్నారు. ఇంకా చిన్న చిల్లర అప్పులన్నీ తీరిస్తే ఆమెకు ఉండటానికి ఇల్లు లేదు, తినటానికి కూడా ఏముండదండి."

అనంతానికి అర్థమైంది. ఆమెకు ఇద్దరు పిల్లలు, మేడిపండులాటి సంసారం మిగిలింది. ఆమె కొంచెమైనా నిజాన్ని తెలుసుకోలేకపోయిందా ? కృష్ణమోహన్ చెప్పినదంతా నమ్మి క్లబ్బులూ, పార్టీలూ అంటూ తిరిగిందా ? ఉన్నట్టుండి నిజం తెలుసుకుంటే మనిషి కుంగిపోదా ? అనంతం ఆలోచిస్తున్నాడు.

"అయితే ఆమెకు ఇంతకాలం తెలియదా ?"

"అయ్యగారు తెలియనివ్వలేదండి ! ఆమెకు కలిసే అవకాశం లేదండి. ఆమె కూడా డబ్బు ఎక్కడనుంచి వస్తున్నదీ. అయ్యగారి జీతమెంత అని ఆలోచించలేదండి అందుకే ఆమె ఈ ఏడాదినుంచీ ఇల్లు ఎట్లా గడుస్తున్నదీ, డబ్బు ఎక్కడినుంచి వస్తున్నదీ పట్టించుకోలేదండి."

'నాకు కొంత తెలుసుననుకో. నేను హెచ్చరించినందువల్లనే మా మధ్య మాటలేకుండా పోయాయి కాని నాకు ఇన్ని వివరాలు తెలియవు."

"అయ్యగారు పట్టుబడి పోయారండి. తప్పించుకొనే మార్గంలేక, ఇంకా ఎన్నో ఉన్నాయండి. అవన్ని రుజువయితే అమ్మగారికి ఏమీ మిగలదండి."

"నాగేశం ! అదంతా జరిగిపోయింది. ఇప్పుడు ఆయన లేడు. ఈ ఇల్లు ఖాళీ చెయ్యాలి. పిల్లలకూ, ఆమెకూ జరుగుబాటెట్లా? నే నడిగితే తప్పయిపోతుంది. అసలు ఇప్పుడు జరగవలసినదంతా ఎట్లా ? దిక్కులేని వాళ్ళయ్యారు."

"అమ్మగారికీ, పిల్లలకూ దిక్కులేదనుకోవద్దండి. ఏడాదినుంచి ఈ సంసారం ఎట్లా నడిచిందో అట్లాగే నడుస్తుందండి పైన దైవమున్నాడు. అమ్మగారు ఇప్పటికైనా నిజం తెలుసుకుని ఉంటే మార్గాలున్నాయండి. వీధిన పడక్కర్లేదండి."

"ఎట్లా అంటావు ?"

"నాకు తెలిసిన కంపెనీలో అమ్మగారికి ఉద్యోగం దొరుకుతుంది. పిల్లలకు కంపెనీవారి స్కూలుందండి. అక్కడ పనిచేసే వాళ్ళకు జీతాలకు తగినట్టు ఇళ్ళున్నాయి, ఒకటి ఇస్తారు. మీరు ఆ కుటుంబాన్ని గురించి బాధపడకండి. ఒక్కటే విచారమండి. అంత మంచి అయ్యగారి జీవితం ఇలా దిగజారిపోయిందని నన్ను కుంగదీస్తున్నదండి."

"ఎంతో తెలివిగలవాడు, మంచివాడు, ఈ స్థితికి దిగజారిపోయాడు. తలుచుకుంటే ఆశ్చర్యంగా ఉంది."

"నాకు ఆశ్చర్యం లేదండి. పొగడ్తలకు లొంగిపోయి ఎటువంటి పనైనా, ఎంత నీచమైన పనైనా చేశారండి. జీతం చాలక డబ్బుకు కక్కుర్తిపడేవారండి. ఖర్చులు రోజురోజుకూ పెరిగిపోయాయండి. వాటికోసం కక్కుర్తిపడటం అలవాటైంది. నాలుగేళ్ళయింది అయ్యగారు మందు తప్ప మంచినీళ్ళు తాగలేదండి."

"ఆమెకు కంపెనీలో ఉద్యోగం వస్తుందన్నావు, అంత సులభంగా దొరుకుతుందా ? ఆమె కది చాలుతుందా ?"

"అమ్మగారూ, పిల్లలూ పైపై మెరుపులు తగ్గించుకుని జాగ్రత్తగా మసలుకుంటే బాగానే జరుగుతుందండి పరిస్థితులకు తగినట్టు నడుచుకోవటం ఒక్కటేనండి చేయవలసింది. కంపెనీలో ఉద్యోగం ఎవరిస్తారు ? అంత సులభమా అన్నారు మీరు. తప్పకుండా వస్తుందండి."

"నీవన్నట్టు నారు పోసినవాడు నీరు పోస్తాడు" బరువుగా నిట్టూర్చాడు అనంతం

తరువాత జరగవలసిన పనులన్నీ నాగేశం స్వయంగా చేయటం చూసి అనంతం ఆశ్చర్యపోయాడు.

మరుసటి నెలకల్లా లలితకు ఉద్యోగం వచ్చింది. వెంటనే ఇల్లుకూడా మారింది. పాపను స్కూల్లో చేర్పించింది.

ఎప్పటికప్పుడు నాగేశం ద్వారా వాళ్ళ సంగతులు తెలుసుకుంటున్నాడు అనంతం. అతనికి అర్థం కానిది ఒక్కటే. ఈ నాగేశం తత్వమేమిటి ? ఇతని

పరిస్థితులు ఎలాంటివి ? మాటిమాటికీ తనను చీవాట్లు పెడుతూ, పురుగును చూసినట్టు చూస్తూ ఉద్యోగంలోనుంచి తీసివేసినవాడి పట్ల, ఆ కుటుంబంపట్ల నాగేశానికింత విశ్వాసమేమిటి ? కృష్ణమోహన్‌కు సస్పెన్షను వచ్చిన తరువాత ఇంటికి కావలసిన డబ్బు అందజేసింది ఈ నాగేశం కాదు కదా ?

నాగేశం చూడటానికి పిచ్చివాడిలా కనబడతాడు. ఆ ముతక ధోవతీ, సగం చేతుల షర్టూ, భుజంమీద గళ్ళతువ్వాల, రేగిన జుట్టు, పీక్కుపోయిన ముఖము.

ఒకనాడు నాగేశం కలిసినప్పుడు "నీవన్నట్టు ఆ కుటుంబాన్ని నిలబెట్టావు. ఆ కంపెనీలో మీవాళ్ళెవరైనా ఉన్నారా, అంత తొందరగా ఆవిడకు ఉద్యోగం దొరికింది."

"దాందేముందిలెండి అవసరం ఉన్నవాళ్ళకు ఉద్యోగం ఇవ్వకపోతే ఇక ఆ కంపెనీ ఎందుకండీ ?"

"నాగేశం నీ విప్పుడేం చేస్తున్నావు ? ఉద్యోగం లేదన్నావు కదా ?"

"పెద్దవాళ్ళిచ్చిన ఆస్తి కొద్దిగా ఉంటే అమ్మి వ్యాపారం చేస్తున్నానండి."

"వ్యాపారం అంటే కంపెనీ పెట్టావా ఏమిటి ?"

తల వంచుకున్నాడు నాగేశం.

"నాగేశం, దేవుడెలా ఉంటాడు ?"

"నా కేంతెలుసునండీ? పెద్ద ఋషులకే కనబడలేదు. ఎలా ఉంటాడో నాకెలా తెలుస్తుందండీ ? నే నొక్కసారైనా భాగవతం చదవలేదు. దేవుడిని తలుచుకోలేదు. నన్నడుగుతున్నారు ?"

"నాకు తెలుసు నాగేశం. నాకు కనబడుతున్నాడు. ఎప్పుడూ కనబడతాడు చూడటానికి పిచ్చివాడిలా ఉంటాడు."

❋❋